# ఇన్‌సైడ్ థింకింగ్‌ను చెప్పేదే రచన

## తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ




**హైదరాబాద్, వెలుగు:** మనిషి లోపలి ఆలోచన గురించి చెప్పేదే రచన అని తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ అన్నారు. త్వరలో రానున్న పిల్లల వికాస పత్రిక బాల చెలిమి చర్చా వేదికలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఫోరం ఫర్ బెటర్ హైదరాబాద్ అధ్యక్షుడు వేదకుమార్ నేతృత్వంలో ఈ పత్రిక రూపుదిద్దుకోనుంది. ప్రైవేటు పాఠశాలలు పిల్లలను యంత్రాలుగా తయారు చేస్తున్నాయని ఈ సందర్భంగా అల్లం నారాయణ అన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో బాల్యం ఎన్నో మధురానుభూతులను పంచుతుందని బాల్యంలోని ఆలోచనలే మానవ పరిణితికి ఉపయోగపడతాయని తెలిపారు. మానవ వికాసం జరగాలన్నా, మనిషి ఎదగాలన్నా సాహిత్యం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పిల్లలు బాల సాహిత్యాన్ని చదవాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. బాలసాహిత్యానికి సంబంధించి మరిన్ని రచనలు రావాల్సిన అవసరముందన్నారు. విద్యార్థులకు ఓ చక్కని సాహిత్య వేదికను అందించేందుకే బాల చెలిమి వికాస పత్రికను తీసుకొస్తున్నామని ఫోరం ఫర్ బెటర్ హైదరాబాద్ అధ్యక్షుడు వేదకుమార్ అన్నారు. జిల్లా, మండలాల వారీగా బాల పత్రికలు విస్తరించాల్సిన అవసరముందని చెప్పారు. ప్రముఖ రచయితలు నాళేశ్వరం శంకరం, గనపురం దేవేందర్, స్ఫూర్తి సంస్థ డైరెక్టర్ పద్మిని శ్రీనివాసన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.